# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- అమరావతి రాజధానిలో నిర్మాణ పనులతో సహా రాష్ట్రంలో కొత్త పెట్టుబడులకు మంత్రి వర్గం ఈ రోజు ఆమోదం తెలిపింది.
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 8వ తేదీన విశాఖ నగరంలో పర్యటించనున్నారని జిల్లా అధికారులు వెల్లడించారు.
- పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నది కేంద్రప్రభుత్వ లక్ష్యమని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు.
- విధి నిర్వహణలో సమర్ధవంతంగా పోలీసులు పనిచేయడం అవసరమని శాసనసభ ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణం రాజు పేర్కొన్నారు.
- భారత మహిళా అథ్లెట్ యర్రాజీ జ్యోతి అర్జున అవార్డుకు ఎంపిక కావడం తెలుగువారికి గర్వకారణమని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు.

===========================

అమరావతి రాజధానిలో నిర్మాణ పనులతో సహా రాష్ట్రంలో కొత్త పెట్టుబడులకు మంత్రి వర్గం ఈ రోజు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు జరిగిన సమావేశంలో అమరావతిలో రెండు ఇంజినీరింగ్ కళాశాలల నిర్మాణంతో పాటు 2 వేల 733 కోట్ల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఆమోదించారు. విశాఖపట్నంలోని మిలీనియం టవర్స్‌లో 2,08,280 చదరపు అడుగుల విస్తీర్ణంలో టీసీఎస్ సంస్థ 80 కోట్ల రూపాయల పెట్టుబడులకు సైతం మంత్రి వర్గం అమోదం తెలిపింది. తిరుపతి జిల్లాలో ఈఎస్ఐ ఆసుపత్రిని 100కు పడకలకు పెంచాలన్న ప్రతిపాదనకు అంగీకారం లభించింది. ఆ వివరాలను సమాచార, ప్రజా సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాత్రికేయులకు వివరిస్తూ…

(వాయిస్ 27 సెకన్లు)

===========================

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 8వ తేదీన విశాఖ నగరంలో పర్యటించనున్నారని జిల్లా అధికారులు వెల్లడించారు. ప్రధానమంత్రి ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా పూడిమడక వద్ద 85 వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అదే విధంగా రైల్వేజోన్ పరిపాలన భవనాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు దృశ్యమాధ్యమ విధానంలో శంకుస్థాపన చేస్తారని వివరించారు. కాగా ప్రధానమంత్రి ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే సభలో ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు పాల్గొంటారని అధికారులు వెల్లడించారు.

===========================

వైయస్సార్ జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా సికె దిన్నె మండలం బుగ్గలపల్లె గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖా సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలు, ఇతర వివరాలను వైద్య ఆరోగ్య శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కేంద్రమంత్రి గర్భవతులు, బాలింతలు, పసి పిల్లల పోషణ గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో కేంద్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తోందని పేర్కొంటూ..

(వాయిస్ 28 సెకన్లు)

===========================

పోలీసులు సక్రమంగా ఉంటేనే సమాజానికి ధైర్యంగా ఉంటుందని రాష్ట్ర శాసనసభ ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణమరాజు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విధి నిర్వహణలో సమర్ధవంతంగా పోలీసులు పని చేయడం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు రేంజ్ డీఐజీ జి.వి.జి.అశోక్ కుమార్, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పాల్గొన్నారు. అనంతరం ఆకివీడు, ఉండి, కాళ్ళ, పాలకోడేరు పోలీస్ స్టేషన్ లకు సంబంధించి సుమారు కోటి రూపాయల వ్యయంతో సమకూర్చిన 4 నూతన వాహనాలను ఆయన ప్రారంభించారు.

===========================

భారత మహిళా అథ్లెట్, విశాఖపట్టణానికి చెందిన క్రీడాకారిణి యర్రాజీ జ్యోతి అర్జున అవార్డుకు ఎంపిక కావడం తెలుగువారికీ గర్వకారణమని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. ఈ రోజు జాతీయ క్రీడా పురస్కారాలను ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం అర్జున అవార్డుకు ఆమెను ఎంపిక చేయడం హర్షణీయమని అన్నారు. క్రీడల పట్ల ఆమెకున్న అంకితభావం, పట్టుదలకు ఈ అవార్డు మంచి ప్రోత్సాహమన్నారు. ఆమె భవిష్యత్తులో మరిన్ని లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆయన కోరారు.

విరామం

===========================

రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 85 శాతం రిజర్వాయర్లలో వరద నీటిని నింపామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సంబంధిత మంత్రి అధికారుల సమిష్టి కృషి వల్లనే ఇది సాధ్యమైందన్నారు. గత సంవత్సరం రాష్ట్రంలో భారీ వర్షాలతో వచ్చిన వరద నీటిని మొత్తం రిజర్వాయర్లకు మళ్ళించామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ సందర్భంగా వివరించారు.

==========================

ఖో ఖో ఆట ప్రపంచ స్థాయికి విస్తరించడం హర్షణీయమని రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.  ఖో ఖో ప్రపంచ కప్ పోస్టర్ ను అమరావతిలోని సచివాలయంలో ఈ రోజు ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... దేశ రాజధాని ఢిల్లీలో ఖో ఖో ప్రపంచ కప్ ని  నిర్వహించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. కాగా, ఢిల్లీలో ఈ నెల  13 నుండి 19వ తేదీ వరకూ వారం రోజుల పాటు జరిగే  ఖో ఖో ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో 21 పురుషుల జట్లు, 20 మహిళల జట్లు పోటీపడతాయి. మొత్తం 24 దేశాల జట్లు ఈ టోర్నమెంట్ కోసం దేశానికి వస్తున్నాయని రాష్ట్ర ఖో ఖో అసోసియేషన్ చైర్మన్ బీ.సీహెచ్. గరటయ్య తెలిపారు.

==========================

శ్రీకాకుళం జిల్లాలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవాలయంలో రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు. ఫిబ్రవరి 2, 3, 4వ తేదీలలో జరిగే ఈ వేడుకలను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. శ్రీకాకుళంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో  ఈ రోజు జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఫిబ్రవరి 2వ తేదీన శోభా యాత్రతో అధ్యాత్మిక కార్యక్రమం మొదలవుతుందని అన్నారు. కాగా, జిల్లాలోని శ్రీకూర్మం శ్వేత పుష్కరణ ఆధునికరణకు రాష్ట్ర ప్రభుత్వం 10 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని తెలిపారు.

==========================

ఆంధ్ర ప్రదేశ్ లో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ అధికారి వెల్లడిస్తూ..

(వాయిస్ 28 సెకన్లు)

==========================

గోదావరి పుష్కరాల కోసం ప్రణాళిక బద్ధంగా పనులు చేపడుతున్నామని  రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు.  2027లో పుష్కరాలు జరగనున్న నేపధ్యంలో రెండు పర్యాయాలు ఉన్నతస్థాయి సమావేశాలు ఏర్పాటు చేశామని అన్నారు. ఘాట్ ల విస్తరణ, కొత్త ఘాట్ ల ఏర్పాటు, ఘాట్ లకు వచ్చే ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ, డ్రైనేజి, వంటి అంశాలపై దృష్టి పెడుతున్నామని ఆయన చెప్పారు.

==========================

ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించింది. ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు ఈ ప్రతిపాదనల ఫైల్  మీద సంతకం చేశారని అధికార వర్గాలు తెలిపాయి. దీని వల్ల రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,600 మంది నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ కింద 24 కోట్ల రూపాయలను విడుదల అవుతాయని పేర్కొన్నారు. కాగా,  గడచిన 6 నెలల వ్యవధిలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఇప్పటివరకు 9 వేల 123 మంది పేదలకు 124 కోట్ల 16 లక్ష రూపాయల మేర ఆర్థిక సహాయం అందిందని అధికార వర్గాలు వివరించాయి.

==========================

==========================